

ర్యాగింగ్ చేస్తే కఠిన శిక్షలు

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి ఎస్పీ రమణకుమార్ హెచ్చరించారు. రంజోల్ సంగమేశ్వర పాలిటెక్నిక్ కళాశాలలో మాట్లాడారు.

8లో

కళ్లలో కారం చల్లి .. కత్తులతో దాడి..



కత్తులతో దాడి చేసి ఆపై కళ్లలో కారం చల్లి దారి దోపిడీకి పాల్పడ్డారు. ఈసంఘటన మెదక్ జిల్లా రేగోడ్ మండలం లోని తాటిపల్లి సమీపంలో జరిగింది.

8లో



ప్రజాసమస్యలను పరిష్కరించాలి

గ్రామాల్లో ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులు దృష్టి సారించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు.

9లో

న్యూస్‌రీల్

మురుగుకాల్వపై ఆక్రమణల తొలగింపు



మురుగు కాల్వపై ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మార్వాడీగల్లిలో మురుగుకాల్వపై ఉన్న ఆక్రమణలను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తొలగించారు. కాల్వలకు ఇరుపక్కలా ఆక్రమణలతో మురుగునీరు వెళ్లక తరచు జామ్ అవుతోంది. దీంతో మున్సిపల్ సిబ్బంది సోమవారం ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు. నెహ్రూ నగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బురదమయంగా మారడంతో డోజర్‌తో తొలగించి చదును చేశారు. ఆయా పనులను శానిటరీ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

నోటి ఆరోగ్యమే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ రాము

పటాన్‌చెరు టౌన్: నోటి ఆరోగ్యం సాధారణ ఆరోగ్యంతో ముడిపడి ఉంటుందని, జీవన నాణ్యతను (శారీరక, సామాజిక, మానసిక) ప్రభావితం చేస్తుందని దంత వైద్యుడు డాక్టర్ రాము నోముల అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో సోమవారం నిర్వహించిన 'ప్రపంచ నోటి ఆరోగ్యం దినోత్సవం'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రుద్రారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఓరల్ హెల్త్ అవేర్‌నెస్ క్యాంపుతో పాటు గీతం ఫార్మసీ విద్యార్థులకు ఉపన్యాసం చేశారు. నోటి నుంచి వచ్చే బ్యాక్టీరియా నేరుగా లాలాజలం, రక్తం ద్వారా గుండెలోకి ప్రవేశిస్తుందని, దీనివల్ల గుండెల్లో మంట వస్తుందని, దీనిని బాక్టీరియల్ ఎండోకార్డిటిస్ అంటారన్నారు. అధిక మద్యసేవనం, మాదకద్రవ్యాల వినియోగం, ధూమపానం దంతక్షయాన్ని పెంచుతుందని, ఇది కొన్నిరకాల నోటి కేన్సర్‌కు దారితీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త డాక్టర్ సీహెచ్. పవన్‌కుమార్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు కూడా పాల్గొన్నారు. దాదాపు 200 మంది రుద్రారం పాఠశాల విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు.

ఫెన్సింగ్ వేయండి



జోనల్ మేనేజర్ అనురాధతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మెట్టు కుమార్

పటాన్‌చెరు టౌన్: ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని బండ్లగూడలో టీఎస్‌ఐఐసీ ఐలా వేస్తున్న ఫెన్సింగ్‌ను రెండు మీటర్ల స్థలం వదిలి వేయాలని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. టీఎస్‌ఐఐసీ ఫెన్సింగ్ వేయడం వల్ల బండ్లగూడలో రోడ్డు పూర్తిగా చిన్నగా మారడంతో పాటు డ్రైనేజీ నిర్మాణం, వీధి దీపాల కోసం విద్యుత్ స్తంభాలు వేయడానికి ఇబ్బందిగా మారుతుందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన కార్పొరేటర్ బండ్లగూడవాసులతో కలసి టీఎస్‌ఐఐసీ కార్యాలయానికి వెళ్లి జోనల్ మేనేజర్ అనురాధ, డిప్యూటీ జోనల్ మేనేజర్ భవానీలను కలిశారు. పలు పరిశ్రమలు నుంచి వ్యర్థనీరు నేతాజీనగర్‌కాలనీలో రావడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వారిఆరోగ్యం దృష్టి పెట్టుకొని డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐలా మాజీ ప్రధాన కార్యదర్శి రంజిత్, విజిలెన్స్ కమిటీ మెంబర్ చంద్రశేఖర్, భారత్, పద్మ, మేరీ పాల్గొన్నారు.

బల్దియా అవినీతి బట్టబయలు

- నల్లగొండ, హైదరాబాద్‌వాసుల పేర్లతో వేతనాలు స్వాహా
- ప్రతినెలా రూ.లక్షల్లో పక్కదారి.. విచారణలో తేటతెల్లమైన అక్రమాలు
- ఉద్యోగుల పరేడ్ నిర్వహించిన అధికారులు
- అక్రమాలపై విజిలెన్స్ విచారణకు డిమాండ్

హైదరాబాద్‌లో నివాసముంటున్న వ్యక్తులను సంగారెడ్డి మున్సిపాలిటీలోని తాగునీటి విభాగంలో పనిచేస్తున్నట్టు రికార్డుల్లో చూపి.. ఒకొక్కరికి రూ.18 వేల వేతనం చొప్పున ప్రతినెలా రూ.1.08 లక్షలు డ్రా చేస్తున్నట్టు అధికారుల విచారణలో తేలింది. ఇలా ఏడాదికి రూ.12.96 లక్షల చొప్పన 2019 నుంచి నాలుగేళ్లుగా సుమారు రూ.51.84 లక్షలు వేతనాలు స్వాహా చేశారు.

శానిటేషన్‌లో ఓ అధికారి వద్ద పనిచేస్తున్న నల్లగొండకు చెందిన ఓ వ్యక్తి పేరుతో కూడా సంగారెడ్డి మున్సిపాలిటీ నుంచి ప్రతినెలా రూ.18 చొప్పన నిధులు డ్రా చేస్తున్నట్టు గుర్తించారు. ఇలా గత ఏడాదికాలంగా ఈ దందా సాగుతున్నట్టు రుజువైంది. పాలకవర్గ నేత కార్యక్రమాలను ఫొటోలు తీసి సోషల్ మీడియాలో ప్రచారం నిర్వహించే మరో వ్యక్తికి కూడా బల్దియా అకౌంట్ నుంచే ప్రతినెలా రూ.18 వేల వేతనం చెల్లిస్తున్నట్టు తేలింది.



అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు చెక్ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ ఇతర అధికారులు



మీడియాతో మాట్లాడుతున్న కౌన్సిల్ సభ్యులు, నాయకులు

సంగారెడ్డి మున్సిపాలిటీ : సంగారెడ్డి బల్దియాలో అవుట్‌సోర్సింగ్ వేతనాల అక్రమాల బాగోతం బట్టబయలైంది. బినామీ పేర్లతో ప్రతినెలా పెద్ద మొత్తంలో రూ.లక్షల్లో వేతనాలు స్వాహా చేస్తున్నట్టు తేలింది. ఈ బల్దియాలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ శరత్ ఆదేశాల మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరితో హాజరు పరేడ్ నిర్వహించగా, ఈ అక్రమాల బాగోతం మొత్తం వెలుగులోకి వచ్చింది. ఈ మున్సిపాలిటీలో 384 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నట్టు రికార్డుల్లో పేర్కొంటున్నారు. వీరికి ఒకొక్కరికి రూ.18 వేల చొప్పున ప్రతినెలా రూ.69.12 లక్షల వేతనాలు డ్రా చేస్తున్నారు. అయితే ఇందులో వందమంది బినామీల పేర్లతో రూ.లక్షల్లో వేతనాలు స్వాహా చేసినట్లు తేటతెల్లమైంది. ఉద్యోగుల పరేడ్‌కు వివిధ పార్టీలకు చెందిన కౌన్సిలర్లు, ఆయా పార్టీల నేతలు, పట్టణ ప్రజలు హాజరయ్యారు. కానీ మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ లతలు హాజరుకాలేదు.

ఒకొక్కరిని పిలిచి రికార్డు పరిశీలన..

విచారణలో భాగంగా ఒక్కో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని పిలిచి వారి ఆధార్‌కార్డులు, బ్యాంక్ అకౌంట్ రికార్డులను అధికారులు పరిశీలించారు. ఈ పరిశీలనలో దాదాపు వంద మంది బోగస్ పేర్లతో ప్రతి నెలా వేతనాలు డ్రా చేస్తున్నట్టు ప్రాథమికంగా తేలిందని అధికార టీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లే ఆరోపించడం ఆసక్తికరంగా మారింది. ఈ బోగస్ ఉద్యోగులను తొలగించడమే కాకుండా, ఈ వేతనాలు స్వాహా చేసిన వారి వద్ద ఈ మొత్తాన్ని రికవరీ చేయాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ స్వాహా కార్యానికి సహకరించిన అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు.

త్వరలోనే నివేదిక సమర్పిస్తాం

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు సోమవారం విచారణ చేపట్టాం. ఈ విచారణలో తేలిన అంశాలపై త్వరలో కలెక్టర్‌కు నివేదిక అందజేస్తాం. ఈ అంశంపై రానున్న కౌన్సిల్ మీటింగ్‌లో చర్చిస్తాం.

– చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్

సంగారెడ్డివాసులుండగా...

సంగారెడ్డి పట్టణంలో ఎంతో మంది నిరుద్యోగులు ఉండగా, నల్లగొండ, హైదరాబాద్ వారికి ఉద్యోగాల పేరుతో వేతనాలు స్వాహా చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ అక్రమాలకు అధికారులు సహకరించారని పలువురు ఆరోపించారు. దీనిపై విజిలెన్స్ విచారణ జరిపి బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు షేక్‌సాబేర్, మిర్దోడిరాజు, పవన్‌నాయక్, కొత్తపల్లిశ్రీకాంత్, సమీ, బీఆర్‌ఎస్ నాయకులు విజేందర్ రెడ్డి, చంద్రశేఖర్, జలంధర్, లాడే మల్లేశం, ఉదయభాస్కర్, లక్ష్మణ్, నర్సింలు తదితరులున్నారు.

పేపర్ లీకేజీపై విచారణ చేపట్టాలి



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

సంగారెడ్డిటౌన్: రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగాలను భర్తీ చేయాలని యువజన కాంగ్రెస్ విభాగం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌శంకర్ పాటిల్ అన్నాడు. సోమవారం యువజన కాంగ్రెస్ విభాగం రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ.. ప్రశ్నపత్రం లీకేజీ చేసి 30 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలను రోడ్డుమీదకు తీసుకొచ్చారన్నారు. చైర్మన్, లీకేజీ చేసిన వ్యక్తిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే తిరిగి నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ కేసును సీబీఐతో దర్యాప్తు చేయాలన్నారు. కార్యక్రమంలో యువజన జిల్లా ఉపాధ్యక్షుడు కూన సంతోష్, జిల్లా కార్యదర్శి వినయ్‌గౌడ్, జహీరాబాద్, అందోల్ నియోజకవర్గం అధ్యక్షులు నరేశ్‌గౌడ్, మల్లేశం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాథోడ్, నాయకులు అభిలాష్, ఖాదీర్, ఫక్రుద్దీన్, ఇబ్రహీం, క్రాంతి, రాఫీ, రాచన్న, సంతోష్, భారత్ తదితరులు పాల్గొన్నారు.

ఐదో రోజు పరీక్ష ప్రశాంతం

కొండాపూర్(సంగారెడ్డి): ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎగ్జామ్ సోమవారం ప్రశాంతంగా జరిగినట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్‌రాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ విద్యార్థులకు మాథ్స్ ఏ, బైపీసీ విద్యార్థులకు బాటనీ, సీఈసీ విద్యార్థులకు పొలిటికల్ సైన్స్ పరీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 20,444 విద్యార్థులకుగాను 19,548 మంది హాజరుకాగా, 896 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 96.90 హాజరుశాతం నమోదైంది.

వినతుల వెల్లువ



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

అర్జీలు స్వీకరించిన రెవెన్యూ డివిజనల్ అధికారులు

సంగారెడ్డిటౌన్ : ప్రజావాణిలో ఆర్డీఓలు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్ రెవెన్యూ డివిజనల్ అధికారులు నగేష్, రమేష్ బాబు, అంబాదాస్‌లు పాల్గొన్నారు. ప్రజావాణిలో మొత్తం 43 దరఖాస్తులు రాగా, రెవెన్యూకు సంబంధించి 18, ఇతరశాఖలకు సంబంధించి 25 ఉన్నాయి. భూ సమస్యలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, పింఛన్లు, స్వయంఉపాధికి రుణం మంజూరు, తదితర సమస్యలపై అర్జీలు అందాయి.

- సంగారెడ్డి పట్టణంలోని రామచంద్రారెడ్డినగర్‌కాలనీలో నివాసముంటున్న నబి రైతు. మల్కాపూర్‌లో అదే గ్రామానికి చెందిన పెంటయ్య నుంచి భూమి కొనుగోలు చేశాడు. కొద్ది రోజుల క్రితం పెంటయ్య నుంచి ఓ మహిళ కూడా భూమి కొనుగోలు చేసింది. అయితే డబుల్ రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకొని నబి కోరాడు.
- కోహిర్, సజ్జాపూర్ గ్రామాల్లోని రేషన్‌డీలర్ ఎంపికలో అవకతవకలు జరిగాయని, దీనికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.
- కంగ్టి మండలంలోని దేవులవాడి గ్రామానికి చెందిన శాంతాబాయి థైరాయిడ్‌తో బాధపడుతోంది. ఆరోగ్యశ్రీ కార్డు కావాలని పలుమార్లు మండల అధికారులను కలిసినా పట్టించుకోలేదని, జిల్లా అధికారులైనా ఆరోగ్యశ్రీ కార్డు వచ్చేలా చూడాలని కోరింది.



కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న రోజారాణి

సమస్యలు పరిష్కరిస్తాం

జిన్నారం(పటాన్‌చెరు): కాలనీల్లోని సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్టు బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి తెలిపారు. పలు వార్డుల్లో సోమవారం ఆమె పర్యటించారు. కాలనీల్లోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాజేంద్రకుమార్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

24న ఖేడ్ తైబజార్ వేలం

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీకి సంబంధించి 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఈనెల 24న మున్సిపల్ కార్యాలయంలో తైబజార్, మేకలబజార్, ఎడ్లబజార్, చిన్నమాంసం దుకాణాలకు సంబంధించి వేలం నిర్వహిస్తున్నట్టు కమిషనర్ గోపు మల్లారెడ్డి తెలిపారు. ఈనెల 24వ తేదీలోగా వేలం డిపాజిట్లు కోసం కమిషనర్ పేరిట డీడీ తీసి కార్యాలయంలో సమర్పించాలన్నారు.

బీఆర్‌ఎస్ పాలన అధ్వానం



నిరసన దీక్షలో బీజేపీ నరేందర్‌రెడ్డి, నందీశ్వర్‌గౌడ్ శ్రీకాంత్ గౌడ్ తదితరులు

పటాన్‌చెరులో బీజేపీ నిరసన దీక్ష

పటాన్‌చెరుటౌన్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలన అధ్వానంగా మారిందని, నిరుద్యోగులకు న్యాయం జరడం లేదని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. సోమవారం బీజేపీ ఆదేశాల మేరకు పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో టీఎస్‌పీఎస్సీ అక్రమాలపై సిట్టింగ్‌జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్, మహిళ మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గోదావరి అంజిరెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ రాజు గోపాల్‌యాదవ్ తదితరులతో కలిసి నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ మంత్రులకు కేంద్రంపై తప్పుడు ప్రచారాలు చేసే దానిపై ఉన్న శ్రద్ధ యువత భవిష్యత్‌పై ఏ మాత్రం లేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ఉద్యోగ నియామకాల్లో అడ్డగోలు అవినీతి జరుగుతోందని ఆరోపించారు. వెంటనే దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్, నాయకులు సహదేవ్, నరేష్, ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

కేతకిలో భక్తుల సందడి



కంట్లం పూజలు చేస్తున్న భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): కేతకి సంగమేశ్వర ఆలయం భక్తులతో సందడిగా మారింది. సోమవారం శివుడికి ఇష్టమైన రోజు కావడంతో భక్తులు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పవిత్ర పుణ్య స్నానాలు ఆచరించి, గర్భగుడిలోని పార్వతి పరమేశ్వరులను క్యూలైన్లలో వేచి ఉండి దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకం, కేశఖండనం, కంట్లం, గుండం పూజ, వాహనపూజ తదితర పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



దాదిగూడలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ఇందుకు నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. జిన్నారం మండలంలోని ఊట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని దాదిగూడెం గ్రామంలో రూ. 15లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం నల్తూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడిదలలో...

గుమ్మడిదల మండలం మొల్లగూడెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. కానుకుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ ఫంక్షన్‌హాలును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి ఉపయోగపడే పథకాలను సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నా.. వెళ్లొస్తాం

- ముగిసిన కొమురవెల్లి బ్రహ్మోత్సవాలు
- తెల్లవారుజామువరకు అగ్నిగుండాలు
- 9 వారాలు వైభవంగా సాగిన జాతర



అగ్నిగుండాలు దాటుతున్న భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్నా.. వెళ్లొస్తాం..మమ్మల్ని సల్లంగ చూడు.. అంటూ భక్తులు ఇంటిబాట పట్టారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారు జాము వరకు సాగిన అగ్నిగుండాలతో కొమురవెల్లిలో మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. భక్తులు భారీ సంఖ్యలో హాజరై అగ్నిగుండాలను దాటారు. ఆలయ ఈఓ, అర్చకులు, పాలక మండలి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ వేదిక ప్రాంగణంలో 7.15గంటలకు వీరభద్ర ప్రస్తాయం, భద్రకాళి పూజ, అగ్నిగుండాల ప్రజ్వలన ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం 5 గంటలకు గురుపూజ, బలిహరణ, అగ్నిగుండాల ప్రవేశం, విజయోత్సవం, ఉదయం 11 గంటలకు స్వామి అమ్మవార్లకు ఏకాదశ రుద్రాభిషేకం, మహా మంగళహారతి, మంత్రపుష్పం అనంతరం తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమానికి కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. 9 వారాలు కొనసాగిన జాతరలో సుమారు 10 లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు సమాచారం.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండాలు..

వీరశైవ ఆగమ శాస్త్ర పద్ధతిలో ఆలయ అధికారులు అగ్నిగుండాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. షట్‌స్థల బ్రహ్మ 108 సిద్ధయత్ శివాచార్య మహాస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది. శని, ఆదివారాల్లో రూ.49,42,426ల ఆదాయం వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, ఈఓ బాలాజీ ఏఈఓ అంజయ్య, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) మహేందర్, చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి, కొమురవెల్లి ఎస్ఐ చంద్రమోహన్, ధర్మకర్తలు, ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్, పూజారులు పాల్గొన్నారు.



పంచ పల్లవాలతో అగ్నిగుండాలను వెలిగిస్తున్న ఆలయ అర్చకులు



బియ్యం సుంకు పడుతున్న అర్చకులు

క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో 18 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివారాలు ఇలా ఉన్నాయి. శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 18 మందిని పట్టుకున్నట్టు చెప్పారు. నిందితులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా జడ్జి 16 మందికి ఒక్కొక్కరికీ రూ.2వేలు, ఇద్దరికి రూ.3వేలు జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

సిద్దిపేటరూరల్: విద్యుదాఘాతంతో యువ రైతు మృతి చెందిన ఘటన జక్కాపూర్‌లో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం


రాజు (ఫైల్)

...నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌కు చెందిన బాయిమీది రాజు(32) రోజు వారీగా వ్యవసాయ పనుల నిమిత్తం ఉదయం 8 గంటలకు బావి వద్దకు వెళ్లోస్తానని ఇంట్లో చెప్పి వెళ్ళాడు. మధ్యాహ్నం అయినా రాజు ఇంటికి తిరిగి రాక పోవడంతో తండ్రి రాములు బావి వద్దకు వెళ్లి చూడగా స్టార్టర్ వద్ద కరెంట్ షాక్ తగిలి కిందపడిపోయి ఉన్నాడు. ఈ విషయాన్ని ఆయన స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించాడు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మరోఘటనలో

పటాన్‌చెరు టౌన్: భాష్యం స్కూల్లో పనిచేసే సెక్యూరిటీ గార్డు విద్యుదాఘాతానికి గురైన ఘట న పటాన్‌చెరు పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు పట్టణ శివారులోని భాష్యం బ్లూమ్స్ స్కూల్లో భగత్‌గల్లికి చెందిన ఎండీ ఉమర్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఇన్‌చార్జి ప్లే గ్రౌండ్ లో నీరు నిలిచాయని, అక్కడ శుభ్రం చేయా లని ఫోన్‌లో ఉమర్‌కు చెప్పాడు. నీరు తీసేందుకు స్కూల్‌కెళ్లిన ఉమర్ మోటర్ ప్లగ్ పెడుతూ ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతానికి గురయి గాయాలయ్యాయి. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని బాధితుడు పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ర్యాగింగ్ చేస్తే కఠిన శిక్షలు

ఎస్పీ రమణకుమార్


విద్యార్థికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ రమణకుమార్

జహీరాబాద్: కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రమణకుమార్ విద్యార్థుల అవగాహన సదస్సులో పేర్కొన్నారు. సోమవారం రంజోల్ గ్రామంలోని శ్రీ సంగమేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఆయన సందర్శించారు. ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రశాంసాపత్రాలను అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ర్యాగింగ్, చట్టాలపై అవగాహన కలిప్పంచారు. కళాశాలల్లో ర్యాగింగ్ చేయొద్దని సూచించారు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించి ఓటీపీ/వ్యక్తిగత పాస్‌వర్డ్/యూపీఐ నెంబర్ ఎవరికీ చెప్పొదన్నారు. కష్టపడకుండా డబ్బులు ఉచితంగా రావని, లక్కీ లాటరీ వంటి వాటిని నమ్మొద్దన్నారు. ఆన్‌లైన్ యాప్‌లో ఎలాంటి రుణాలు తీసుకోవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్ మాట్లాడోద్దని, ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏదైనా సైబర్ క్రైం బారిన పడితే 1930 నెంబర్‌కు 24గంటల లోపు ఫిర్యాదు చేస్తే డబ్బులను రికవరీ చేయొచ్చన్నారు. చిన్న పిల్లలపై జరిగే నేరాల గురించి, పోక్సో చట్టం గురించి ఎస్పీ అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల అవసరం కావాలనుకున్నప్పుడు 100 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ వి.రఘు, సీఐ తోట భూపతి, జహీరాబాద్ రూరల్, ఝరాసంగం ఎస్ఐలు పి.పరమేశ్వర్, రాజేందర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

గుర్తు తెలియని వాహనం ఢీ కొని...


స్వామిగౌడ్(ఫైల్)

దుబ్బాకరూరల్: గుర్తు తెలియని వాహనం ఢీ కొని పాదాచారుడు మృతి చెందిన సంఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని నగరం చౌరస్తా వద్ద జరిగింది. ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం...పోతారెడ్డిపేట గ్రామానికి చెందిన బండారి స్వామిగౌడ్(45) భూంపల్లి చౌరస్తా వద్ద బావర్చి హోటల్లో సప్లయర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం తెల్లవారు జామున 4గంటలకు పోతారెడ్డిపేట నుంచి భూంపల్లి వైపు నడుచుకుంటూ వస్తుండగా సిద్దిపేట వైపు నుంచి ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని ఓ వాహనం ఢీ కొట్టింది. దీంతో అతని తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుని భార్య నవ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదానికి గురై వ్యక్తి మృతి

కొండపాక(గజ్వేల్): రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రెడ్డమైన మల్లయ్య(65)మృతి చెందాడని కుకునూరుపల్లి ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కుకునూరుపల్లికి చెందిన రెడ్డమైన మల్లయ్య సోమవారం ఉదయం హోటల్లో టీ తాగేందుకు ఇంటి నుంచి నడుచుకుంటూ రోడ్డు దాటుతున్నక్రమంలో హైద్రాబాద్ నుంచి సిద్దిపేట వైపునకు వెలుతున్న ద్విచక్ర వాహనం వేగంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన మల్లయ్యను గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడని ఎస్సై పేరొన్నారు. మృతుని కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ద్విచక్ర వాహనదారుడు బాదావత్ రవిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


మల్లయ్య మృతదేహం

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య


కనకవ్వ (ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని పెద్దకోడూరు గ్రామానికి చెందిన బోనాల కనకవ్వ(45), ఘణయ్య దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. వారికున్న 4 ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లో మూడున్నర ఎకరాల భూమి ముంపునకు గురైంది. ఈ క్రమంలో పెద్ద కూతురుకు వివాహం జరిపించారు. రెండో కూతురు వివాహం చేయాలని నిశ్చయించుకున్నారు. కుటుంబ పోషణ భారమై ఎలా గడుస్తుందని గత కొద్ది రోజులుగా మనోవేధన చెందుతుంది. మనస్థాపం చెందిన ఆమె ఈ నెల 8న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. దీన్ని గమనించిన కుటుంబీకులు వెంటనే సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

హత్నూర(సంగారెడ్డి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన హత్నూర పోలీస్ స్టేషన్ పరిధిలో కాసాల శివారులో ఆదివారం చోటుచేసుకుంది. సోమవారం హత్నూర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మద్దికుంట గ్రామానికి చెందిన వడ్డె రమేష్ (41)తో కాసాల గ్రామానికి చెందిన రమాదేవితో రెండో వివాహం జరిగింది. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేది. పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు పెట్టినా వారిలో మార్పు రాలేదు. ఆదివారం రమేష్ తన భార్యను తీసుకెళ్లడానికి కాసల గ్రామానికి వచ్చాడు. భార్యను తనవెంట రమ్మని కోరగా రమాదేవి భర్త వెంట వెళ్లడానికి నిరాకరించింది. దీంతో రమేష్ తిరిగి ఇంటికి వెళుతుండగా కాసాల బస్టాండ్ సమీపంలో రాగానే అకస్మాత్తుగా కింద పడిపోవడంతో స్థానికులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వెంటనే చికిత్స నిమిత్తం నరస్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.

బెల్టు షాపులపై దాడులు... ముగ్గురిపై కేసు

అల్లాదుర్గం(మెదక్): అక్రమ మద్యం విక్రయిస్తున్న బెల్టుషాపులు, దాబాలో విక్రయాలు చేసినందుకు స్పెషల్ టాస్క్ పోలీసులు దాడి చేసి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్వెర ఐబీ చౌరస్తాలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. చిల్వెర ఐబీ చౌరస్తాలో అక్రమ మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు రెండు షాపులపై దాడులు నిర్వహించి భారీ మొత్తంలో మద్యం స్వాధీనం చేసుకున్నారు. బెల్టు షాపు నిర్వాహకులు జనార్ధన్‌గౌడ్, ప్రదీప్‌గౌడ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ దేవిదాస్ చెప్పారు. అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో, ఎస్పీ ఆదేశాల మేర పోలీసులు దాడులు నిర్వహించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండలంలోని సత్వార్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై గుర్తు తెలియని మృతదేహం సోమవారం లభ్యమైందని చిరాగ్‌పల్లి ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. సుమారు 30 సంవత్సరాల వయసు కల్గిన వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడని పోలీసులు పేర్కొన్నారు.

'చర్యలు తీసుకోండి'

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎమ్మెల్సీ కవితను కించపరుస్తూ ప్రచారం చేస్తున్న యూట్యూబ్ ఛానల్స్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు గోవింద్ సోమవారం సీఐ సంజయ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూట్యూబ్ ఛానల్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫోర్జరీ సంతకాలతో భూ కబ్జాకు యత్నం

చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు

మెదక్ మున్సిపాలిటీ: కొందరు వ్యక్తులు ఫోర్జరీ సంతకాలతో తప్పుడు పత్రాలు సృష్టించి 4.30ఎకరాల భూమిని కబ్జా చేస్తున్నారని, ఈ విషయంలో న్యాయం చేయాలని తార్నాక సికింద్రాబాద్‌కి చెందిన బి.హనుమా నాయక్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. సోమవారం పోలీసు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతులను ఎస్పీ రోహిణి ప్రియదర్శిని స్వీకరించారు. తార్నాక, సికింద్రాబాద్‌కి చెందిన బి.హనుమా నాయక్ తనకు మాసాయిపేట మండలం రామాంతాపూర్‌లో సర్వే నెం.250/అలో ఒక ఎకరా30 గుంటల భూమి, సర్వే నెం.250/ఉలో మూడు ఎకరాలు మొత్తం నాలుగు ఎకరాల 30 గుంటల భూమి ఉన్నదని ఎస్పీకి చెప్పారు. ఈ భూమిని కొందరు వ్యక్తులు సంతకం, వేలు ముద్రను ఫోర్జరీ చేసి తప్పుడు పత్రాలను సృష్టించి తన ఆస్తిని లాక్కోవడానికి యత్నిస్తున్నారన్నారు. ఈ విషయంలో చట్టప్రకారం ఫిర్యాదు దారుడికి తగిన న్యాయం చేయమని మెదక్ పట్టణ సీఐకి జిల్లా ఎస్పీ ఆదేశించారు.


ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మరో ఫిర్యాదులో

చేగుంట మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన మందాపురం వెంకట్ రెడ్డి ప్రస్తుతం తాను సుచిత్రలో ఉంటున్నాడని, తన స్వంత గ్రామమైన కిష్టాపూర్‌లో తన పేరిట ఇల్లు ఉందన్నారు. ఈ నెల 10న అదే గ్రామానికి చెందిన మందాపురం కిష్టారెడ్డి తన ఇంటి తాళం పగులగొట్టాడని ఫిర్యాదు చేశాడు. ఈ విషయంలో కిష్టారెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: రోజుకో కొత్త తరహాలో మోసాలకు పాల్పడుతున్నా సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని సీపీ శ్వేత తెలిపారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో సోమవారం జరిగిన సైబర్‌నేరాల వివరాలు ఇలాఉన్నాయి. సిద్దిపేట పట్టణంలోని ఓ వ్యక్తికి ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని ఓ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి నమ్మించాడు. వెంటనే సదరు బాధితుడు రూ.27,303 పెట్టుబడిగా పెట్టి మోసపోయాడని గ్రహించాడు.

మరో ఘటనలో

మద్దూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి ర్యాపిడ్ అప్లికేషన్ సమస్య ఉండడంతో కస్టమర్‌కేర్ నెంబర్‌కి ఆన్‌లైన్‌లో సెర్చ్ చేయగా అందులో కనిపించిన నెంబర్‌కు ఫోన్ చేశాడు. దీంతో గుర్తుతెలియని వ్యక్తి యాప్ డౌన్‌లోడ్ కోసం డబ్బులు చెల్లించాలని తెలిపారు. దీంతో అతను ఆన్‌లైన్‌లో రూ.14,981 పంపించాడు. తర్వాత ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా ఏలాంటి స్పందన లేకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించాడు. వెంటనే జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

ఇద్దరు చిన్నారుల అదృశ్యం

- వాట్సాప్, సోషల్ మీడియా చూసి కుటుంబ సభ్యులకు అప్పగింత

సిద్దిపేటకమాన్: ఇంటి ముందు ఆడుకుంటూ అదృశ్యమైన ఇద్దరు పిల్లలను పోలీసులు కుటుంబ సభ్యులను గుర్తించి వారికి అప్పగించిన సంఘటన సిద్దిపేట పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. వన్ టౌన్ సీఐ బిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సంతోష్ తన భార్య, ఇద్దరు పిల్లలతో పది సంవత్సరాలుగా సిద్దిపేట పట్టణం నాసర్‌పూరలో నివాసం ఉంటున్నాడు. సంతోష్ సిద్దిపేటలో ఐస్‌క్రీం ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం సంతోష్ పని నిమిత్తం బయటకు వెళ్లగా తన భార్య ఇంటి పనుల్లో నిమగ్నమై ఉంది. ఈ క్రమంలో ఇద్దరు పిల్లలు బాబు అమాన్(5), పాప స్వీటీ(3)తమ ఇంటి ఎదుట ఆడుకుంటుండగా కొద్ది దూరంలో ఉన్న బారాహిమామ్ చౌరస్తా వద్దకు చేరుకున్నారు. దీంతో వారు తిరిగి ఇంటికి వెళ్లలేకపోయారు. రోడ్డుపైన పిల్లలు ఏడుస్తూ ఉండడాన్ని యాదగిరి గుర్తించి పిల్లలను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లాడు. విషయం తెలుసుకున్న సీఐ బిక్షపతి, ఎస్ఐలు నరసింహారావు, రవీందర్, మల్లేశం, హెడ్ కానిస్టేబుల్ చంద్రం ఇద్దరు పిల్లల ఫొటోలు, వారు తెలిపిన వివరాలను వాట్సాప్ గ్రూపులో, సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. విషయం తెలుసుకున్న ఐస్‌క్రీం ఫ్యాక్టరీ యజమాని పిల్లల తండ్రిని తీసుకుని పోలీసు స్టేషన్‌కు వచ్చాడు. పోలీసులు ఇద్దరు పిల్లలను సంతోష్‌కు అప్పగించారు. ఆయన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

యువతి..

యువతి అదృశ్యమైన ఘటన సిద్దిపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం...గొడుగు బుజ్జి, శ్రీనివాస్ దంపతులు తమ ఇద్దరు కూతుళ్లతో కలిసి సిద్దిపేట న్యూ కేసీఆర్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. చిన్న కూతురు సంతోషి (19) ఏడాది నుంచి పట్టణంలోని వైభవం షాపింగ్ మాల్‌లో పని చేస్తుంది. రోజు మాదిరిగానే విధులకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తల్లి బుజ్జి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడి...

శివ్వంపేట(నర్సాపూర్): చెన్నాపూర్ గ్రామంలో యువకుడు అదృశ్యమైన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ రవికాంత్‌రావ్ తెలిపిన వివరాల ప్రకారం ... గ్రామానికి చెందిన మన్నే రమేష్ ఈ నెల 13న మధ్యాహ్నం మసీద్‌పల్లిలోని అక్క ఇంటికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అతను అక్క దగ్గరకు వెళ్లకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు రమేష్‌కు ఫోన్ చేస్తే స్విచ్ అఫ్ ఉంది. దీంతో బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా అతని ఆచూకీ లభించలేదు. సోమవారం యవకుడి తండ్రి మన్నే వెంకటేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

పాపన్నపేట(మెదక్): పాము కాటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన పాపన్నపేటలో చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...దౌలాపూర్ గ్రామానికి చెందిన వడ్ల అశోక్ (32)కుటుంబీకులతో కలిసి పాపన్నపేటలో ఓ ఇంట్లో అద్దెకుంటున్నాడు. ఆదివారం నిద్రిస్తున్న అశోక్‌ను కట్లపాము కాటు వేసింది. వెంటనే తేరుకున్న అశోక్ తనకు పాము కరిచిన విషయాన్ని భార్య గంగమణికి తెలిపాడు. ఆమె స్థానికుల సాయంతో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. అశోక్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

పులి సంచారంపై ఆధారాల సేకరణ

రాయికోడ్(అందోల్): మండలంలోని మహమ్మదాపూర్ గ్రామ శివారులో పులి సంచరిస్తోందని వచ్చిన సమాచారంపై అధికారులు స్పందించారు. ఆధారాల సేకరణకు అక్కడ పర్యటించారు. రాయికోడ్ ఎస్ఐ ఏడుకొండలు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఇనాయత్ అలీలు గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. పలు ప్రాంతాల్లో పులి అడుగులు ఉన్నాయా? లేవా? అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి స్థానికులనుంచి కావలసిన వివరాలను నమోదు చేసుకున్నారు. అక్కడ పలు ప్రాంతాల్లో ఉన్న అడుగులను పరిశీలించారు. ఈ సందర్భంగా బీట్ ఆఫీసర్ ఇనాయత్ అలీ మాట్లాడుతూ పులి సంచరిస్తున్నట్లు ఎలాంటి ఆధారాలు తమకు లభించలేదన్నారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేర పరిశీలించిన అడుగులు హైనవని తెలుసుకున్నారు. పులి సంచరిస్తున్న వాదనలో నిజం లేదని నిగ్గ తేల్చారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి భయ భ్రాంతులకు గురికావొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగమేశ్వర్ పాటిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.


జంతువుల అడుగులను పరిశీలిస్తున్న ఎస్ఐ ఏడుకొండలు, బీట్ ఆఫీసర్ ఇనాయత్ అలీ

దాడి ఘటనలో 18 మందికి జైలు

రాయికోడ్(అందోల్): 2015లో నమోదైన రెండు కేసుల్లో 18 మంది నిందితులకు న్యాయమూర్తి జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు. సంగాపూర్‌కి చెందిన యూ.అశోక్ 2015లో మునిపల్లిలో ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన యూ.అంజమ్మ కుటుంబ సభ్యులు వేధించడం వల్లే అశోక్ ఆత్మహత్య చేసుకున్నాడని అంజమ్మ ఇంటి ఎదుట కుటుంభ సభ్యులు ఆందోళన చేశారు. గ్రామస్తులు అశోక్ మృతికి పరిహారంగా అంజమ్మ మూడు ఎకరాల భూమిని మృతుడి కుటుంబానికి ఇవ్వాలని ఒప్పందం కుదిర్చారు. తమను భయపెట్టి అన్యాయంగా భూమిని రాయించుకున్నారని అంజమ్మ తిట్టింది. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అంజమ్మ, కుటుంబ సభ్యులను బంధించి దాడి చేశారు. బలవంతంగా భూమిని రాయించుకుని దాడికి పాల్పడ్డారని అంజమ్మ 9 మందిపై, ఆమె భర్త నర్సింలు 12 మందిపై వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదైన వారిలో ముగ్గురు చనిపోయారు. సోమవారం న్యాయమూర్తి జి.అనూష 18 మంది నిందితులకు రూ.2వేల చొప్పున జరిమానా వేసి 3 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి...

వట్‌పల్లి(అందోల్): చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి మంజీరానది బ్యాక్ వాటర్ నీటిలో మునిగి మృతి చెందిన ఘటన సోమవారం దరఖాస్తుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ అంబర్యా తెలిపిన వివరాల ప్రకారం... దరఖాస్తుపల్లికి చెందిన మాదిగ సమ్మయ్య(38) అదే గ్రామానికి చెందిన మేకల లక్ష్మయ్య, మంగళి నర్సయ్యలతో కలిసి ఆదివారం మధ్యాహ్నం మంజీర బ్యాక్‌వాటర్ పరిసర ప్రాంతానికి చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగాడు. వెంటనే మిగత ఇద్దరు కుటుంబీకులకు సమాచం ఇచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న కుటుంబసభ్యులు మంజీరానదిలో గాలించిన ఆచూకీ దొరకలేదు. తిరిగి సోమవారం గజ ఈతగాళ్ల సహాయంతో గాలించగా మృతదేహం బయటపడింది. సమ్మయ్య గ్రామ పంచాయతీ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుని భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో యువకుడు గల్లంతు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ చెరువులో యువకుడు గల్లంతైన సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. నర్సాపూర్ ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ కూకట్ పల్లికి చెందిన భార్గవ్ (22) స్నేహితులతో కలిసి నర్సాపూర్ అర్బన్ పార్క్ తిలకించేందుకు వెళ్లి రాయరావు చెరువులో గల్లంతయ్యాడు. భార్గవ్‌కు ఇటీవల జాబ్ రావడంతో స్నేహితులకు పార్టీ ఇచ్చేందుకు నర్సాపూర్ వచ్చినట్లు స్నేహితులు తెలిపారు. ముందుగా అర్బన్ పార్కును తిలకించి చెరువు పక్కన నిర్మిస్తున్న కాటేజీల పక్కన చెరువులో దిగి సరదాగా నీటిలో ఆడుతుండగా భార్గవ్ నీటిలో మునిగి గల్లంతయ్యాడు. అక్కడే ఉన్నా అతని స్నేహితులు అరుపులు పెట్టగా కాటేజ్‌లో వద్ద పనిచేస్తున్న మేస్త్రీలు వచ్చి భార్గవ్‌కోసం గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీసులకు వారు సమాచారం ఇవ్వగా తహసీల్దార్ ఆంజనేయులు, ఎస్సై శివకుమార్‌లు గజ ఈతగాళ్లతో వెళ్లి గాలించినా ఫలితం లేదు. చీకటి పడడంతో మంగళవారం వెతికిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కళ్లల్లో కారం చల్లి.. ఆపై కత్తులతో దాడి..

రూ.6.50 లక్షలు అపహరణ

రేగోడ్(మెదక్): ఓ వ్యాన్‌కు బైక్‌లు అడ్డుపెట్టి కళ్లలో కారం చల్లి.. కత్తులు, కర్రలతో దాడి చేసి దోపిడీ చేశారు. మెదక్ జిల్లా రేగోడ్ మండలంలోని తాటిపల్లి సమీపంలో సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న అల్లాదుర్గం సీఐ జార్జి, రేగోడ్ ఏఎస్ఐ మల్లయ్య హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. అల్లాదుర్గం సీఐ జార్జి తెలిపిన కథనం ప్రకారం.. జహిరాబాద్ నుంచి టీఎస్15 యూఏ 6556 నంబరు గల డీసీఎం వ్యాన్‌లో పెద్దశంకరంపేట, రేగోడ్‌లో సిగరేట్, బీడీ, చాక్లెట్ (ఐటీసీ ప్రోడక్ట్)ను విక్రయించి తిరిగి జహిరాబాద్ వెళ్తున్నారు. తాటిపల్లి సమీపంలోకి రాగానే రెండు బైక్‌లపై సుమారు ఆరుగురు దుండగులు వ్యాన్ ముందు.. వెనుకాల ఆపారు. వ్యాన్‌లో ఉన్న ఐదుగురి కళ్లల్లో కారం చల్లి కత్తులతో, కర్రలతో దాడి చేశారు. వ్యాన్‌లో ఉన్న సుమారు రూ.6 లక్షల 50వేలను తీసుకుని పారిపోయారు. ఈ విషయం తెలుసుకున్న అల్లాదుర్గం సీఐ జార్జి, పెద్దశంకరంపేట ఎస్ఐ బాల్‌రాజ్, రేగోడ్ ఏఎస్ఐ మల్లయ్య ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

మద్యం బంద్ చేయించండి సారూ..!

జోగిపేట సీఐకి నాదులాపూర్ మహిళల మొర

జోగిపేట(అందోల్): సార్ మా ఊళ్లో మద్యం విచ్చలవిడిగా అమ్ముతున్నారు. అది తాగి మా భర్తలు మమ్మల్ని కూడా మల్లమ్మలాగే చంపేస్తారంటూ జోగిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్ఐ సామ్యానాయక్‌ల ఎదుట మహిళలు మొర పెట్టుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి నాదులాపూర్ గ్రామంలో ముద్దాయిపేట నారాయణ తన భార్యను చంపి ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో విచారణ నిమిత్తం వచ్చిన సీఐ, ఎస్ఐలకు స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకొని వారితో మాట్లాడారు. రోడ్డు పక్కన బెల్ట్‌షాపుల్లో మందు తాగి రాత్రి గొడ్డలితో నరికేసాడని వారు పోలీసులతో చెప్పారు. గ్రామంలో ప్రతీగల్లీల్లో మద్యం అమ్ముతున్నారని వాటిని తాగిన భర్తలు తమను మానసికంగా, శారీరకంగా బాధలకు గురిచేస్తున్నారని పోలీసులతో చెప్పారు. అంతేకాకుండా మద్యానికి బానిసై ఇంట్లో ఏ వస్తువులుంటే ఆ వస్తువును అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం తాగోద్దని చెబితే భర్తలు ఇష్టం వచ్చినట్లు కొడుతున్నారని మహిళలు పోలీసులతో చెప్పారు. వెంటనే ఈ ప్రాంతంలో మద్యం నిషేధించాలని పలువురు మహిళలు పోలీసులను కోరారు. మాజీ ఎంపీటీసీ బాలమణి సీఐ వద్దకు వెళ్లి మందు బంద్ చేయించాలని కోరగా గ్రామ పంచాయతీ నుంచి తీర్మానం చేసి సదరు ప్రతీని తమకు అందజేయాలని సీఐ సూచించారు. రెండు రోజుల్లో పంచాయతీలో తీర్మానం చేసి పోలీస్‌శాఖ, ఎక్సైజ్‌శాఖ అధికారులకు అందజేస్తామని సర్పంచ్ సత్యనారాయణ పేర్కొన్నారు. గ్రామంలో తప్పకుండా మద్యం అమ్మకాలను బంద్ చేయిస్తామని సీఐ మహిళలకు హామీ ఇచ్చారు.


నాదులాపూర్‌లో సీఐ నాగరాజుతో మాట్లాడుతున్న మహిళలు